

వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్మిస్తున్న

## రాజగోపురంకు రూ. లక్ష విరాళం

**విశ్వంభర, ఎల్బీనగర్ :** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కె పురం డివిజన్ పరిధిలోని సౌభాగ్య పురంలోని అత్యంత పవిత్రమైన అలివేలు మంగ పద్మావతి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయం లో నిర్మిస్తున్న రాజగోపురం పనులల్లో భాగంగా దశావతారాల నిర్మాణానికి రూ. లక్ష (1,00,000) కైంకర్యముగా దేవాలయ కమిటీ సభ్యులకు అందజేసిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ చంద్ర శేఖర్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, దేవాలయ కమిటీ కార్యదర్శి వెంకట్ రెడ్డి, వైస్ ఛైర్మెన్ రమణయ్య పాల్గొన్నారు.

## అశ్లీల ఫోటోలు పంపిస్తు ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యక్తి అరెస్ట్

**విశ్వంభర , చైతన్యపురి :** మహిళ ఫోన్ నంబర్ కు అశ్లీలమైన ఫోటోలు పంపిస్తు ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించిన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట మార్గదర్శి కాలనీలోని విజయలక్ష్మి అనెక్స్ అపార్ట్ మెంట్ లో నివాసం ఉంటున్న యలమంచిలి హిమబిందు అనే మహిళకు అదే అపార్ట్ మెంట్ లో నివాసం ఉండే నాగిరెడ్డి నాగసుబ్బారెడ్డి ఈ నెల 4 న హిమబిందుకు అశ్లీలమైన ఫొటోలను పంపిస్తూ ఆమెను ఇబ్బంది పెడుతున్నాడు. పరిస్థితిని గమనించిన మహిళ చైతన్యపురి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి తనకు న్యాయం చేయాలని కోరింది.ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని ఈ నెల 5 న పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి పై కేసులో ఏడు సంవత్సరాల లోపు శిక్ష గల సెక్షన్ల కింద కేసు నమోదు అయినందున చట్ట పరిధిలోని యు/ఎస్ 35(1) ప్రకారం నోటీసు ఇచ్చి తిరిగి ఫిర్యాదురాలైన హిమబిందుకు ఎటువంటి ఇబ్బంది కలిగించినా తీవ్రమైన చర్యలు ఉంటాయని సుబ్బారెడ్డిని తీవ్రంగా హెచ్చరించి పంపినట్లు సిఐ తెలిపారు. ఈ నెల 12న మధ్యాహ్నం పై కేసులోని ఫిర్యాదురాలైన హిమబిందు సుబ్బారెడ్డి పై కేసు పెట్టినందుకు కేసును ఉపసంహరించుకోవాలని ఆమెకు ఎటువంటి అశ్లీల ఫోటోలు పంపకుండా ఉండుటకు అతనికి రూ.10 లక్షలు ఇవ్వాలని తిరిగి హిమబిందును బెదిరించినట్లు ఆమె ఫిర్యాదు చేసిందన్నారు. ఈ ఫిర్యాదుపై మరో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఉదారత

### పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజు భారం భుజానికెత్తిన మంత్రి



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల పట్ల తన ఉదారతను మరోసారి చాటుకున్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. పరీక్ష ఫీజుల భారం విద్యార్థులపై పడకూడదని నిర్ణయించిన ఆయన, సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులందరి తెలంగాణ ఎస్ఎస్సీ బోర్డు ఫీజును తన జీతం నుంచి చెల్లించడానికి ముందుకొచ్చారు.ఏ విద్యార్థి ఆర్థిక ఇబ్బందులతో చదువు మానకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనకు లేఖలో తెలిపారు. విద్యకు ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా గత కొన్నేళ్లుగా ఆయన పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి, టాయిలెట్ల నిర్మాణం, డిజిటల్ క్లాస్‌రూమ్స్, డబుల్ డెస్క్ బెంచీల పంపిణీ, నోట్ బుక్స్ సరఫరా తదితర సేవలకు చొరవ చూపుతున్నారు.

## గిరిజన సంక్షేమ రంగంలో చారిత్రాత్మక మార్పులు

**విశ్వంభర, హైదరాబాద్ :** తమ పార్టీ ఎన్నికలతో పాటు దేశ గౌరవం, భారతదేశ స్వాతంత్ర్యం , దేశ సంస్కృతి, ధర్మాన్ని కాపాడేందుకు పోరాడిన మహనీయులను గౌరవించే సంప్రదాయం ఉందని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ పేర్కొన్నారు. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇటీవలి కాలంలో సర్దార్ వల్లభాయి పటేల్ 150వ జయంతిని రన్ ఫర్ యూనిటీ, మార్చ్ ఫర్ యూనిటీ వంటి కార్యక్రమాల ద్వారా ఘనంగా జరుపుకున్నాం. కొద్ది రోజుల క్రితం వందే మాతరం 150 సంవత్సరాల సందర్భంగా కూడా అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మరో మహానాయకుడు భగవాన్ బిర్సా ముండా జయంతి ఘనంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం జనజాతీయ గౌరవ దివస్"గా ప్రకటించిందన్నారు. బిర్సా ముండా బ్రిటిష్‌లతో పాటు మిషనరీల అన్యాయాలకు వ్యతిరేకంగా గిరిజన హక్కుల కోసం పోరాడారు. ఆయన భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ఆశ, ప్రేరణ, ధైర్యాన్ని ఇచ్చారు. ఆయన జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మోడీ అధికారం చేపట్టిన తరువాత గిరిజన సంక్షేమ రంగంలో చారిత్రాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. ఆయన నాయకత్వంలో 6,700 గ్రామాల్లో 90,000 ఇళ్లకు పైప్‌లైన్ ద్వారా తాగునీటి సదుపాయం కల్పించబడిందన్నారు. వెయ్యి కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు, 531 గిరిజన తెగలను వన్ ధన్ వికాస్ కేంద్రాలు కింద సమీకరించి ఆర్థిక స్వావలంబన దిశగా చర్యలు చేపటినట్లు వెల్లడించారు. ఈ ఏడాది గిరిజన సంక్షేమం కోసం రూ. 42 వేల కోట్లు కేటాయించటం మోడీ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ పాలనలో గిరిజన సంక్షేమం ఎప్పుడూ ప్రాధాన్యం పొందలేదు. గిరిజన సమాజం కోసం నిజంగా కృషి చేసింది బీజేపీ ప్రభుత్వం మాత్రమే. గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, ఎస్.టీ. కమిషన్ మొదటగా అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వంలోనే ఏర్పడ్డాయి. పలు నోడల్ ఏజెన్సీల ద్వారా గిరిజన అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. తెలంగాణలో కూడా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందించే కాంట్రాక్టర్లకు ఇప్పటికీ బకాయిలు చెల్లించలేదు. ముఖ్యమంత్రి ఇటీవల కొంత బకాయిలు క్లియర్ చేస్తామని చెప్పి ఇప్పటివరకు ఇవ్వలేదని మండిపడ్డారు. గురుకుల పాఠశాలలు, బీసీ హాస్టళ్లలో, గిరిజన హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్లకు చెల్లింపులు లేకపోతే మధ్యాహ్న భోజన పథకం స్తంభించే ప్రమాదం ఉందన్నారు. అనేక బీసీ హాస్టళ్లలో ఆహార నాణ్యత తీవ్రంగా తగ్గింది. విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. తాజాగా అచ్చంపేటలో బీసీ హాస్టల్‌లో 50 నుంచి60 మంది విద్యార్థులు అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. వికారాబాద్‌లో కూడా హాస్టల్ భోజనం తిన్న తర్వాత అనేక మంది విద్యార్థులు వాంతులు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

○ తహసిల్దార్ వేణుగోపాల్







**విశ్వంభర, సరూర్ నగర్ :** మహేశ్వరం నియోజకవర్గం సరూర్ నగర్ డివిజన్ లోని డాక్టర్స్ కాలనీ సర్వే నంబర్ 9/1లోని దాదాపు 3 ఎకరాల ప్రభుత్వ భూమిని , ఎల్బీనగర్ నియోజకవర్గం లింగోజిగూడ లోని 1.21 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి ఆధీనంలోకి ప్రభుత్వం తీసుకున్నది. సరూర్‌నగర్‌లోగల భూమి విలువ రూ.200 కోట్ల వరకు ఉంటుంది, లింగోజిగూడ లోని భూమి విలువ బహిరంగ మార్కెట్లో దాదాపు 80 కోట్ల వరకు ఉంటుంది. ఇప్పటి వరకు ఆక్రమణ దారుల చేతుల్లో మగ్గిపోయిన విలువైన ప్రభుత్వ భూములు ఒక్కొక్కటిగా ఆధీనంలోకి వస్తున్నాయి. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వాళ్లపై ఉక్కు పాదం మోపాల్సిందిగా ప్రభుత్వం ఇప్పటికే రెవెన్యూ యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. చెరువులు, కుంటలు, బఫర్ జోన్లు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం హైడ్రాను తీసుకొచ్చిన విషయం విధితమే. ఇటు హైడ్రా, అటు రెవెన్యూ యంత్రం కలిసి సరూర్‌నగర్ మండలంలో ఇప్పటి వరకు భూ కబ్జాదారుల చేతుల్లో చిక్కిన సుమారు రూ.200 కోట్ల విలువైన భూములను కాపాడటం విశేషం. లింగోజిగూడ డివిజన్ సర్వే నంబర్ 86లోని 1.21 ఎకరాల భూమి గత యాభై ఏళ్లుగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో చిక్కుకుపో యింది. ఈ విలువైన భూమిని మూడు నెలల క్రితం అధికారులు స్వాధీనం చేసుకుని చుట్టూ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు. డాక్టర్స్ కాలనీ సర్వే నంబర్ 9/1లోని 2.20 ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేశారు. కొంత మంది ప్రైవేటు వ్యక్తులకు 9/7లో భూమి ఉండగా, వాళ్లు పొజిషన్‌కు భిన్నంగా 9/1 లోని సర్వే నంబర్‌లోని భూమిని కబ్జా చేశారు., ఇప్పటికే ఇక్కడ ఐదు నిర్మాణాలు కూడా చేపట్టారు. రెండు రోజుల క్రితం రెవెన్యూ అధికారులు ఆ భూమిలోని నిర్మాణాలను కూల్చివేసి, కబ్జా దారుల చెర నుంచి విడిపించారు. బైరమల్‌గూడలో రూ.12 కోట్ల విలువ చేసే పది గుంటల ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చంపాపేట సర్వే నంబర్ 3లో రూ.ఎనిమిది కోట్ల విలువ చేసే 800 గజాలను కాపాడారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పిస్తున్నాం: తహసిల్దార్ వేణుగోపాల్.

ప్రభుత్వ భూములకు పూర్తి రక్షణ కల్పిస్తున్నాం. కబ్జా కాకుండా భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నాం. సరూర్‌నగర్ మండలంలోని 11 ప్రాంతాల్లో కబ్జాకు గురైన భూములను ఆధీనంలోకి తీసుకున్నాం. ఇప్పటికే వెలిసిన నిర్మాణాలను కూడా కూల్చి వేశాం. ఆయా భూముల రక్షణ కల్పించడంతో పాటు హెచ్చరిక బోర్డులు పెడుతున్నాం.



సాగర్‌రింగ్ రోడ్డు వన్‌కన్వెషన్ హాల్‌లో చైతన్య పురి భవాని కేఫ్ యజమాని రామిరెడ్డి, రమ దంపతుల కుమార్తె సాయిప్రసన్న, అమర్‌నాథ్‌రెడ్డి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన సాయినగర్ కమిటీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, మరియు కమిటీ సభ్యులు.

## హైదరాబాదులో 16న బిసి న్యాయ సాధన దీక్ష

○ ఎంపీ ఆర్ కృష్ణయ్య



**విశ్వంభర, హైదరాబాద్ :** బీసీల రిజర్వేషన్ల సాధనకై ఈ నెల 16న హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో "బీసీ న్యాయ సాధన దీక్ష" నిర్వహించనున్నట్లు ఎంపీ ఆర్. కృష్ణయ్య ప్రకటించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా కల్పించాలనే డిమాండ్‌తో ఈ దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. గురువారం కాచిగూడలో బీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జల్లిపల్లి అంజి అధ్యక్షతన బీసీ కులసంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రెండు రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని ప్రకటించిన సందర్భంలో, చట్టబద్ధంగా మాత్రమే ఎన్నికలు జరపాలని ఆయన స్పష్టంచేశారు. విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లతో పాటు స్థానిక సంస్థల రిజర్వేషన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం రావలసి ఉంటే రాజ్యాంగ సవరణ తప్పనిసరి అని కృష్ణయ్య అన్నారు. ఇందుకోసం అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయానికి రావాలని విజ్ఞప్తి చేశారు.బీసీ రిజర్వేషన్ల అంశంలో కోర్టులు అనేక సార్లు వ్యతిరేక తీర్పులు ఇచ్చినా, ఇతర రాష్ట్రాల్లో బీసీలు ఉద్యమాలు చేయలేదని ఆయన పేర్కొన్నారు. అయితే తెలంగాణలో బీసీల రిజర్వేషన్ల రక్షణ కోసం రాష్ట్ర బంద్ జరగడం గర్వించదగిన విషయం అని తెలిపారు. ఇది రాష్ట్ర బీసీల చైతన్యానికి నిదర్శనమని అన్నారు.ఆర్టికల్ 243డి ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని, కావున అసెంబ్లీలో చట్టం చేసిన తర్వాత వెంటనే ఎన్నికలు జరపడంలో ఎటువంటి రాజ్యాంగ అవరోధం లేదని కృష్ణయ్య స్పష్టం చేశారు. జనాభా లెక్కలు మరియు ఎంపరికల్ డాటా ఆధారంగా బీసీ రిజర్వేషన్లకు న్యాయపరమైన ఆధారం ఉంటుందని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు కూడా 50 శాతం సీలింగ్ నిబంధనను పలు కేసుల్లో సడలించిన దృష్ట్యా, ఈ అంశంపై బీసీలు న్యాయపరంగా గెలిచే అవకాశం ఎక్కువగా ఉందని అభిప్రాయపడ్డారు.రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘాలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు సమావేశాలు నిర్వహించి ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలు, మండలాలు, పట్టణ స్థాయిలో నిరాహార దీక్షలు, ధర్నాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సి. రాజేందర్, మోదీ రాందేవ్, భీమ్ రాజ్, రాజ్ కుమార్, శివకుమార్ యాదవ్ పాల్గొన్నారు.

## జనవరిలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర మహాసభలు

### అడహక్ కమిటీ కన్వీనర్ గా రాంచందర్

### అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, ఇండస్థలాలపై సర్కారుకు వినతులు




**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర మహాసభలను వచ్చే సంవత్సరం జనవరి చివరి వారంలో నిర్వహించాలని సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం(సర్వసభ్య సమావేశం) తీర్మానం చేసింది. మహాసభల నిర్వహణ కోసం సీనియర్ జర్నలిస్ట్స్ సంఘం సీనియర్ ఉపాధ్యక్షులు పి.రాంచందర్ కన్వీనర్ గా నియమించింది. మరో 23 మందితో అడహక్ కమిటీని ఏర్పాటు చేసింది. గురువారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీనియర్ జర్నలిస్ట్ పిల్లి రాంచందర్ అధ్యక్షతన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ, ఉపాధ్యక్షులు జి. మాణిక్ ప్రభు, తాటికొండ కృష్ణ, గుడిగ రఘు, బి. రాజశేఖర్, కార్యదర్శులు ఎస్కె సలీమ, ఈ చంద్రశేఖర్, బి. జగదీష్, కొప్పు నిరంజన్, బి. దయాసాగర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మణిమాల, విజయ, బీవీఎన్ పద్మరాజు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని ఫెడరేషన్ రాష్ట్ర ఆఫీసు బేరర్లు, కార్యవర్గ సభ్యులు, 33 జిల్లాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, స్టేట్ కౌన్సిల్, నేషనల్ కౌన్సిల్, అక్రిడిటేషన్ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టులకు సంబంధించి అక్రిడిటేషన్లు, ఇండ్లస్థలాలు, హెల్త్‌కార్డుల విషయంలో త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించింది. మామిడి సోమయ్య, బండి విజయ్కుమార్, వల్లాల జగన్, తన్నీరు శ్రీనివాస్, కుడితూడి బాపూరావు ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేయడంతోపాటు సంఘం నుంచి శాశ్వతంగా బహిష్కరిస్తూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం చేసిన తీర్మానాన్ని విస్తృతస్థాయి సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. బహిష్కరణకు గురైన వారికి ఇక నుంచి టీడబ్ల్యూజేఎఫ్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఫెడరేషన్ పేరుతో ఎలాంటి కార్యక్రమాలు, కార్యకలాపాలు నిర్వహించరాదని సమావేశం తీర్మానించింది. ఈ విషయాన్ని జర్నలిస్టులు, ఫెడరేషన్ శ్రేయోభిలాషులు గ్రహించాలని విజ్ఞప్తి చేసింది. ఏకపక్షంగా సోమయ్య వేసిన జిల్లా కమిటీలను రద్దు చేస్తున్నట్టు విస్తృత కార్యవర్గం ప్రకటించింది.



## 14 ఏళ్లకే కూచిపూడిలో పట్టా



**విశ్వంభర, హైదరాబాద్ :** కృషి , పట్టుదల ఉంటె ఏదైనా సాధించగలం అనే మాటను నిజం చేసింది ఆష్నా షెఫాలీ. తన తల్లి కోరిక కూచిపూడి నాట్యంలో నాట్యకళాకారిణిగా చూడడం. కూచిపూడి గురువు శిరీషా పోలవరపు దగ్గర మూడున్నర సం.రాల వయసు నుండి శిక్షణ అందించింది తల్లి కల్పన. 10 సం. రాలు కూచిపూడిలో చాలా కష్టపడి, 14 సం. రాలకే కూచిపూడి శిక్షణలో డిగ్రీ పట్టా అందుకుంది. ఆ తరువాత దాదాపు 100 కు పైగా సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రదర్శనలు చేసింది. తానూ నమ్ముకున్న , నేర్చుకున్న కళను పదిమందికి అందించాలనే సంకల్పంతో ఎన్జీఓ సహకారంతో సంకల్పం కూచిపూడి అకాడమీ ని ప్రారంభించి, గురువు శిరీషా పోలవరపు ఆశీస్సులతో 30 మంది చిన్నారులకు శిక్షణ అందిస్తుంది. నిరుపేద కుటుంబాల చిన్నారులను ప్రోత్సహిస్తూ వారికున్న ఆసక్తికి ఉచితంగా సేవలు అందిస్తుంది . రానున్న రోజుల్లో ఈ అకాడమీ ని విస్తృతపరచి శిక్షణ అందించేలా చేస్తానని అన్నారు. తెలుగు వారి సంస్కృతి , సాంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు కూచిపూడి నాట్యం ను ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు కోసం కృషి చేస్తానని తెలిపారు. మారుతున్న కాలానికి వారసత్వ సంపద , కళల గురించి నేటి సమాజంలో చాలామందికి తెలియడం లేదని, మన కళలను , మన సంస్కృతి లో భాగం అవ్వడానికి నేటి చిన్నారులు , యువత ఎంతో దోహదం చేయాలని అన్నారు. ప్రపంచంలోనే భారతదేశం సకల సంస్కృతి , సాంప్రదాయాలకు చిరునామా , గౌరవానికి ప్రతీక.. జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో కూచిపూడి ప్రదర్శనలు చేసి దేశ గొప్పతనాన్ని చాటడమే నా లక్ష్యంమని అన్నారు. తన తల్లి తండ్రులు ఎంతో సహకరిస్తున్నారని వారి ప్రోద్బలంతో మరిన్ని ప్రదర్శనలు చేస్తానని తెలిపింది. బాలల దినోత్సవం సందర్భంగా ఆష్నా షెఫాలీతో విశ్వంభర దినపత్రిక స్పెషల్ ఫోకస్.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కౌంటింగ్ కు సర్వం సన్నద్ధం

### జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్

**విశ్వంభర, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కౌంటింగ్ కు సర్వం సన్నద్ధం చేశామని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ తెలిపారు.నేడు ఎన్నిక కౌంటింగ్ నేపథ్యంలో గురువారం యూసఫ్ గూడ కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలోనీ మీడియా సెంటర్ లో పాత్రికేయులకు కౌంటింగ్ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి వివరించారు.ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ చేస్తామన్నారు. నోటా తో కలిపి 59 మంది అభ్యర్థులు బరిలో ఉన్నందునఈసీఐ నుండి ప్రత్యేక అనుమతి తీసుకుని ఈ సారి 42 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.గరిష్టంగా 10 రౌండ్ లు చేస్తారని చెప్పారు.కౌంటింగ్ ప్రక్రియను ఈసీఐ సాధారణ పరిశీలకులు , ఈసీఐ బృందం పరిశీలిస్తారని చెప్పారు.కౌంటింగ్ ప్రక్రియకు 186 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. వీరిలో కౌంటింగ్ సూపర్ వైజర్ లు, కౌంటింగ్ అసిస్టెంట్ లు, కౌంటింగ్ మైక్రో అబ్జర్వర్స్ ఉంటారని అన్నారు. ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా, ఈసీ యాప్ ద్వారా అప్డేట్ ఇస్తామని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు, వారి ఏజెంట్లకు, కౌంటింగ్ ఏజెంట్ లకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఇతరులకు ప్రవేశం ఉండదని జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ స్పష్టం చేశారు.జాయింట్ సిపి తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ.. రేపు కౌంటింగ్ కోసం ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అన్ని విభాగాల పోలీసు బృందాలు అందుబాటులో ఉంటాయని, రేపు కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.సమావేశంలో అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, రిటర్నింగ్ అధికారి పి సాయిరాం,విజిలెన్స్ అదనపు ఎస్పీ నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

